క్లుప్తంగా

నేటి నుండి అంకాలమ్మ తిరునాల

వల్లూరు : స్థానికంగా వెలసిన శ్రీ మహాంకాళి అంకాలమ్మదేవి తిరునాల మహోత్సవాన్ని బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు అంకాలమ్మ సేవా సంఘంవారు ఒక ప్రకటనలో తెలిపారు. 9న ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, రాత్రి 7 గంటలకు ఉయ్యాల సేవ, అనంతరం గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 10న ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అలంకరణలు, అనంతరం కుంకుమ బండ్లు, అమ్మవారికి బోనాల సమర్పణ, అనంతరం బండ లాగుడు పోటీలు జరుగుతాయన్నారు. 11న సాయంత్రం 6 గంటలకు కొర్లబండి తిరిగే కార్యక్రమం జరుగుతుంది. భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గొనాలని వారు కోరారు.

నేడు గంధోత్సవం

జమ్మలమడుగు : మైలవరం మండలంలోని పడమటి కొండల్లో వెలసిన పీర్ గైబుసా వలి ఉరుసు మహోత్సవాలు ప్రారంభం అయినట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉరుసు ప్రారంభోత్సవం కార్యక్రమంలో భాగంగా జెండా ఊరేగింపు నిర్వహించారు. బుధవారం రాత్రి గంధోత్సవం మైలవరం నుంచి ప్రారంభం అవుతుందని, గురువారం ఉరుసు మహోత్సవం జరుగుతుందని తెలిపారు.

11న ఆలయ భూముల వేలం

పెద్దముడియం : పెద్దపసుపుల గ్రామంలోని శ్రీ మాధవ–ఆంజనేయ దేవస్థానములకు సంబంధించిన భూములకు ఈనెల 11వ తేదీ వేలం పాట జరుగునని ఆలయ ఈవో విశ్వనాథరెడ్డి తెలిపారు. దేవస్థానములకు సంబంధించి మెత్తం 55 ఎకరాలను మూడు సంవత్సరాల కౌలుకు సంబంధించి వేలం పాట జరుగుతుందన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.5000 డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా మాలేరియా అధికారి డాక్టర్ మనోరమ అకస్మికంగా తనిఖీ చేసి ల్యాబ్‌ను, ఎన్‌సీడీ సర్వేపై నివేదికలను పరిశీలించారు. సర్వేలో ఎక్కడైన క్యాన్సర్ కేసులు కనిపిస్తే వెంటనే కడప రిమ్స్‌కు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ గణేష్‌కుమార్‌రెడ్డి, మలేరియ సబ్ యూనిట్ అధికారి లక్షుమయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి పాల్గొన్నారు.

పోషణ పక్వాడపై అవగాహన

లింగాల : దిగువ లింగాల అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి ఆధ్వర్యంలో మంగళవారం పోషణ పక్వాడ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి ప్రతి మహిళ గర్భం దాల్చినప్పటి నుండి బిడ్డకు రెండేళ్ల వరకు తీసుకునే వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణి కాన్పు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బిడ్డ పుట్టిన తర్వాత తల్లి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

గురుకుల పాఠశాల పరిశీలన

తొండూరు : స్థానిక బాలయోగి బీసీ గురుకుల పాఠశాల నిర్మాణాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పరిశీలించారు. గత ప్రభుత్వంలో దాదాపు రూ.50 కోట్ల నిధులతో తొండూరు, మల్లేల గ్రామాల మధ్య బాలయోగి బీసీ గురుకుల బాలికల పాఠశాల నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను కిచెన్, ఫ్లోరింగ్, వసతి గదుల నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నందున, అందుకు సంబంధించి రూ.10 కోట్ల నిధులను విడుదల చేసి వచ్చే ఏడాదిలో ప్రారంభిస్తామన్నారు. అలాగే తొండూరు ఐటీఐ కళాశాలకు వెళ్లి అక్కడ విద్యార్థులతో మాట్లాడి ఫ్లోరింగ్, చిన్న, చిన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

పశువుల దాహం తీర్చేందుకు నీటి తొట్లు

పెండ్లిమర్రి : వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నీటి తొట్లను ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చిందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిని శారదమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని పగడాలపల్లె, వెయ్యినూతల కోన క్షేత్రంలో ఏర్పాటు చేస్తున్న నీటి తొట్ల పనులను ఆమె పరిశీలించారు. వేసవిలో పశువులు, గొర్రెలు, మేకలకు నీటి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు.

భక్తి శ్రద్ధలతో ఉత్తర ద్వార దర్శనం



మోక్ష నారాయణ స్వామికి గరుడ సేవ చేస్తున్న భక్తులు



పూజలందుకుంటున్న మోక్ష నారాయణస్వామి

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం కామాదా శుక్ల ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథ శర్మ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిట కిట లాడింది. ప్రతి నెల ఏకాదశి రోజున ఉత్తర ద్వారం గుండా హరి హరాదులను దర్శించుకునే ఆలయం ఇదొక్కటే కావడంతో భక్తులు విరివిరిగా తరలి వచ్చారు. నిత్య కల్యాణ మూర్తులుగా వెలుగొందుతున్న మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి, వల్లిదేవసేన సుబ్రమణ్యస్వామి వార్లను భక్తులు ఉత్తర ద్వారం గుండా దర్శించుకున్నారు. అనంతరం భక్తుల మధ్య సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం చేపట్టారు. ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథ శర్మ , పుణ్యభూమి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యన్నదానాల్లో భాగంగా భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వార్లను మాడ వీధుల గుండా గరుడ సేవ చేశారు. అలాగే రథంపై స్వామి వార్లను ఊరేగింపు నిర్వహించారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



శ్రీసీతారాములకు పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు, తదితరులు

వేంపల్లె : స్థానిక వాసవికన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శ్రీ రామ పట్టాభిషేకం, పుష్పయాగం వైభవంగా నిర్వహించామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం శ్రీసీతారాముల వారికి ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో అభిషేకం, అర్చనలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పట్టాభిషేక శాంతి హోమం, పూర్ణాహుతి తదితర హోమాలు నిర్వహించారు. అనంతరం రాత్రి శాశ్వత ఉభయదారులు దివంగత పోలేపల్లె సుబ్బారాయుడు కుటుంబ సభ్యులచే శ్రీసీతారాముల పుష్పయాగం, పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. కర్ణాటక నుంచి ప్రత్యేకంగా తెప్పించిన 16 రకాల పుష్పాలను ఆర్యవైశ్య మహిళలు మేళతాళలతో తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిబుల్ ఐటీ డైరెక్టర్ కుమార్‌స్వామిగుప్తా దంపతులు హాజరై స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, శ్రీ వాసవి కల్యాణ మండపం అధ్యక్షుడు కామిశెట్టి సతీష్‌కుమార్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మ, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కల్యాణ మండపం, అవోపా, ఆర్యవైశ్య మహిళా మండలి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాద్రోహి చంద్రబాబునాయుడు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజా ద్రోహి అని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డిలు అన్నారు. మంగళవారం వీరపునాయునిపల్లెలోని పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలతో వారు ఆత్మీయ సమేశన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ప్రజల కష్టాలు తెలుసుకుని వారి అవసరాలను గుర్తించిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అందువల్లనే నేడు కాలర్ ఎగురవేసుకుని ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం నాయకులు ప్రజల దగ్గరికి వెళ్లేందుకు బయపడుతున్నారని తెలిపారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యాడన్నారు. ఇప్పటికే గ్రామాల్లో కూటమి నాయకులను ప్రజలు నిలదీస్తున్నారన్నారు. రాబోవు రోజుల్లో చొక్కాలు పట్టుకోవడం తథ్యమని తెలిపారు. కార్యకర్తలకు కొంతమేర అన్యాయం జరగడం వాస్తవమేనన్నారు. రాబోవు రోజుల్లో వారిదే కీలక పాత్ర అని కావున పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రస్తుతం చంద్రబాబునాయుడు చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకెళ్లి వారికి అర్థమయ్యేలా వివరించాలని పిలుపునిచ్చారు. కమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యేగా రెండు సార్లు మంచి మెజారిటీతో గెలిపించారని 2029లో ఎన్నికల్లో యువనాయకుడు నరేన్ రామాంజులరెడ్డిని ఆదరించి మంచి మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవలు చేయడమే ప్రధాన లక్ష్యమని తెలియజేశారు. మెఘా డీస్సీపై తొలి సంతకం చేసి నేటికి 11నెలలు దాటుతున్నా ఇంతవరకు డీఎస్సీ నిర్వహించలేదన్నారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని నిరీర్యం చేసేందుకు చంద్రబాబు కుట్ర చేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీర ప్రతాప్‌రెడ్డి, జిల్లా సెక్రటరీ వాసుదేవరెడ్డి, కమలాపురం నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు సరోజమ్మ, సీనియర్ నాయకుడు రాజుపాలెం వెంకటరామిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు ముర్రు పాలు చాలా అవసరం

పులివెందుల రూరల్ : పుట్టిన బిడ్డకు ముర్రు పాలు చాలా అవసరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగేశ్వరి తెలిపారు. మంగళవారం పట్టణంలోని భాకరాపురం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లులకు పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి రెండేళ్ల వరకు పోషకాహారం ప్రాముఖ్యత, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు ఎంతో అవసరమని అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డలకు ఆరు నెలల పాటు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మావతి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

పెండ్లిమర్రి : రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చంద్రశేఖర్, ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కల్పనలు డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలోలో వారు మాట్లాడారు. గత 19 సంవత్సరాల నుంచి ఆశా వర్కర్లు గ్రామాల్లో, పట్టణాల్లో గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. వారికి ఎలాంటి ఉద్యోగ భద్రత గాని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించడం లేదు. కనీసం కార్మికులుగా గుర్తింపు లేకుండా పని చేస్తున్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యుడు రామప్రసాద్‌కు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

కమలాపురం : ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు తప్పని సరిగా పాటించాలని ఎస్ఐ విద్యా సాగర్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించి మాట్లాడారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ప్రమాద బీమా తప్పని సరిగా కలిగా ఉండాలన్నారు. రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలు నిలిపి ప్రయాణీకులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. ప్రయాణీకులను ఎక్కించుకునేటప్పుడు, దించేటప్పుడు రోడ్డుకు పూర్తిగా పక్కన ఆపాలన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోలో ఎక్కించుకో వద్దన్నారు. ఆటోలో ప్రయాణించే వారితో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ ఆటోలు నడపరాదన్నారు.

మాత, శిశు మరణాలు లేకుండా చేద్దాం



ఆశా కార్యకర్తలకు యూనిఫాం అందిస్తున్న డాక్టర్ రేష్మా

తొండూరు : మాత, శిశు మరణాలు లేకుండా చేద్దామని పీహెచ్‌సీ డాక్టర్ రేష్మా తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రమాదకరమైన గర్భిణులను త్వరితగతిన గుర్తించాలని, తద్వారా త్వరగా వైద్య సేవలందించి ప్రమాదస్థితి నుండి కాపాడవచ్చునన్నారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ అందించే 108, 104 వాహనాల సేవలతోపాటు జనని సురక్ష యోజన, జనని శిశు సంరక్షణ, పీఎం మాతృత్వ వందన యోజన, పీఎం సురక్షిత మాతృత్వ అభియాన్ పథకాల గురించి తెలియజేశారు. అనంతరం ఆశా కార్యకర్తలకు యూనిఫాం రెండు చీరెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ విజయ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సూపర్‌వైజర్ శశికళ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్డుదారులందరికి రేషన్ సరుకులు అందాలి



ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ జాన్ ఎర్విన్

కమలాపురం : కార్డుదారులందరికి తప్పని సరిగా రేషన్ సరుకులు అందాలని ఆర్‌డీఓ జాన్ ఎర్విన్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌ను ఆయన సాధారణ తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. స్టాక్‌ను, రికార్డులను పరిశీలించగా ఎటువంటి వ్యత్యాసం లేక పోవడాన్ని గమనించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ సరుకులు ప్రతి కార్డుదారునికి సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఎటువంటి అక్రమాలు జరిగిన తక్షణం చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శివరామిరెడ్డికి ఆదేశించారు. ఎండీయూ వాహనాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. రేషన్ సరుకుల పంపిణీలో ఎటువంటి అక్రమాలు జరిగినా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. రేషన్ పంపిణీని రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నియంత్రణ మనందరి బాధ్యత



దోమల మందును పిచికారి చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పులివెందుల రూరల్ : దోమల నియంత్రణ మనందరి బాధ్యత అని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శాంతి కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక జెండా మానువీధిలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటా ఫీవర్ సర్వే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దోమ కాటు వలన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధి, ఫైలేరియా వంటి వ్యాధులు వస్తాయని, ప్రతి ఒక్కరూ డ్రై డే, ఫ్రైడే పాటించి దోమల వృద్ధిని అరికట్టాలన్నారు. అనంతరం దోమల నివారణకు ఆరోగ్య సిబ్బంది పైరిత్రం పిచికారి చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సోమేశ్వరి, ఆశా కార్యకర్తలు మాధవి, సౌందర్య, శానిటరీ సెక్రటరీ సోమన్న పాల్గొన్నారు.

పిల్లలకు సెల్‌ఫోన్లు దూరంగా ఉంచాలి



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ముంతాజ్‌బేగం

కొండాపురం : చిన్న వయసులోనే స్మార్ట్‌ఫోన్లు వాడకం వల్ల పిల్లలు ఎదగలేరని పిల్లలకు సెల్‌ఫోన్ దూరంగా ఉంచాలని ఐసీడీఎస్ సీడీపీఓ ముంతాజ్ బేగం తెలిపారు. మంగళవారం కొండాపురం–2, రామసుబ్బారెడ్డి నగర్‌లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు ఎక్కువ మొబైల్ చూస్తుంటే మొబైల్ నుంచి వెలువడే రేడియోషన్ వల్ల ట్యూమర్‌వచ్చే అవకాశం ఉందన్నారు. బయట ఆడుకోలేకపోవడం వల్ల వారి వ్యక్తిత్వం అభివృద్ధి చెందదన్నారు. సెల్‌ఫోన్‌లో యూట్యూబ్, కార్టూన్‌లు ఎక్కువగా చూడటంవల్ల మెదడుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. సెల్‌ఫోన్ వల్ల చిన్నవయస్సులోనే అద్దాలు వస్తాయన్నారు. అనంతరం గర్భిణులకు, కిషోర బాలికలకు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ అందాలంటే డబ్బు చెల్లించాల్సిందే..

తొండూరు : మండలంలో పింఛన్ వెరిఫికేషన్ అంటూ అధికారులు పింఛన్‌దారులకు నోటీసులు జారీ చేశారు. వారం రోజుల నుంచి మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని ఆయా అధికారులు వికలాంగుల పింఛన్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని అందుకు పులివెందుల వైఎస్సార్ సర్వజన ఆసుపత్రిలో ఈనెలలో వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని పింఛన్‌దారులకు నోటీసులు అందజేశారు.

దీంతో కొంతమంది అధికారులు, కొంతమంది అధికార పార్టీ నాయకులు కలిసి నోటీసులు అందించిన పింఛన్ దారులకు పింఛన్లు తొలగించకుండా ఉండాలంటే డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని, డబ్బులు చెల్లించకోకుంటే పింఛన్ ఉండదని కొంత మంది అధికారులు పింఛన్ దారులకు హుకుం జారీ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని సచివాలయాల పరిధిలోని ఆయా అధికారులు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు డబ్బులు చెల్లిస్తే మీ పింఛన్‌ను ఉన్నతాధికారులతో మాట్లాడి తొలగించకుండా ఉండేందుకు ప్రయత్నం చేస్తామన్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేశారు. అయితే అదే పింఛన్‌దారుల నుంచి ఎలాగైనా పింఛన్లను వెరిఫికేషన్ అంటూ కొన్ని పింఛన్లను తొలగించాలనే ప్రభుత్వం ప్రయత్నంలో భాగంగానే కొనసాగుతున్నట్లు పింఛన్ల దారులు వాపోతున్నారు. చాలామంది వికలాంగులు అర్హతలు ఉన్న తమకు నోటీసులు ఇవ్వడంతో తమ పింఛన్లు ఎక్కడ తొలగిస్తారోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని నోటీసులు ఇచ్చిన పింఛన్లు తొలగించకుండా తమకు న్యాయం చేయాలని పింఛన్‌దారులు కోరుతున్నారు.

వక్ఫ్ బిల్లును రదు చేయాలి

వేంపల్లె : ఇటీవల కేంద్రంలోని ఎన్డీఏ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు అమెండ్మెంట్ బిల్లు రాజ్యాంగ విరుద్ధమంటూ తక్షణమే బిల్లును రద్దు చేసి వెనక్కి తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ రహంతుల్లా, ఆ పార్టీ జిల్లా కో–కన్వీనర్ దాదా పీర్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం వేంపల్లెలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి నాయకులు ప్రజల దృష్టి మళ్లించేందుకు వక్ఫ్ బోర్డు ఆస్తులు కాజేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ముస్లిం సమాజానికి సంబంధించిన ఆస్తులు అని, కోర్టులో కొట్లాడాలంటూ హితవు పలికారన్నారు.

ముస్లింల ద్రోహి సీఎం చంద్రబాబు

పులివెందుల : ముస్లిం మైనార్టీల ద్రోహి సీఎం చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.షామీర్‌బాషా తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఇతర వైఎస్సార్‌సీపీ ఎంపీలకు ముస్లిం మైనార్టీ సమాజం నుండి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

పేదలకు మూడు సెంట్లు స్థలం ఇవ్వాలి

కొండాపురం : పేదలకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని జమ్మలమడుగు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఎం.వి.సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ రాష్ట్రసమితి పిలుపు మేరకు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా అర్హులైన పేదల వారికి మూడు సెంట్లు ఇంటి స్థలంతో పాటు భూమి లేని పేదలకు రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నిల హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ గురప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మనోహర్‌బాబు, ఎఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి పి.వెంకటరమణ, మండల అధ్యక్షుడు టి.సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఏపీ కార్ల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ హాజరై ప్రకృతి వ్యవసాయ విధానాలు, వ్యవసాయ ఇన్‌పుట్స్ తయారీ, ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్, విత్తన గుళికలు, ప్రకృతి వ్యసాయ సూత్రాలు తదితర అంశాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ శిక్షణ ద్వారా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తమ క్షేత్రస్థాయి పనితీరును మెరుగుపరుచుకోవడంతోపాటు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై సమర్థవంతంగా మద్దతు ఇవ్వగల స్థాయికి ఎదగడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా అమలు చేసేందుకు అవసరమైన అంశాలను ఈ శిక్షణ ద్వారా వివరించామన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మెరిసిన కడప బిడ్డ

క్రీడా రంగంలో కడప బిడ్డ మెరిసింది. వైఎస్సార్ జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపింది. యర్రంపల్లె నుంచి శ్రీలంక టోర్నీలో భారత జట్టు తరుపున ప్రాతినిధ్యం వహిస్తూ క్రీడా అణిముత్యంగా నిలుస్తోంది. క్రీడల్లో రారాజుగా వెలుగుతున్న క్రికెట్‌లో సత్తా చాటుతున్న ధ్రువతార, ఉమెన్ ప్రీమియర్ లీగ్ నుంచి భారత జట్టులో చోటు సంపాదించింది. జిల్లా ఖ్యాతిని నిలిపిన ఆ యువతి పేరు శ్రీచరణి.

- భారత క్రికెట్ జట్టులోకి ఎంపికైన శ్రీచరణి
- యర్రంపల్లె నుంచి శ్రీలంక టోర్నీకి
- ఉమెన్ ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున రాణింపు



శ్రీచరణి



కుటుంబ సభ్యులతో శ్రీచరణి



సీఏవైడీతో శ్రీచరణి

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా వీరపునాయునిపల్లె మండలం యర్రంపల్లె గ్రామానికి చెందిన నల్లపురెడ్డి చంద్రశేఖరరెడ్డి, రేణుక దంపతుల కుమార్తె శ్రీచరణి. తండ్రి ఆర్టీపీపీలో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్. ఒకటి నుంచి 10వ తరగతి వరకూ ఆర్టీపీపీలోని డీఏవీ స్కూల్‌లో చదివింది. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని లేపాక్షి జూనియర్ కళాశాలలో పూర్తి చేసింది. ప్రస్తుతం వీఎన్‌పల్లె వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతూ క్రికెట్‌లో రాణిస్తోంది.

అండర్–19 నుంచి భారత జట్టు స్థాయికి..

2017–18లో క్రికెట్‌లో జిల్లా అండర్–19 జట్టుకు ఎంపికైంది. అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూడలేదు. అదే ఏడాది రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది. జిల్లాకు చెందిన క్రికెట్ శిక్షకులు ఖాజామైనుద్దీన్, మధుసూదన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ఎన్నో మెలకువలు నేర్చుకుంది. 2021లో అండర్–19 చాలెంజర్స్ ట్రోఫీలో ఇండియా–సి జట్టుకు ప్రాతినిధ్యం వహించిన శ్రీచరణి 4 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. 2023లో బీసీసీఐ సీనియర్ అంతర్ రాష్ట్ర మహిళల క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించి కర్నాటక జట్టుపై 7వికెట్లు, అండర్–23 మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టుపై 5వికెట్లు తీసి ఉత్తమ ప్రదర్శన కనబర్చింది. లెఫ్ట్ ఆర్మ్ బౌలర్‌గా, లెఫ్ట్ హ్యాండ్ బ్యాట్స్ ఉమెన్‌గా నిలకడగా రాణిస్తోంది. శ్రీచరణి ఆట నైపుణ్యం గుర్తించిన డబ్ల్యూపీఎల్ ప్రతినిధులు డిల్లీ క్యాపిటల్స్‌కు రూ.55 లక్షలతో ఎంపిక చేసుకున్నారు. తాజాగా ఏప్రిల్ 27 నుంచి జరిగే ముక్కోణపు వన్డే సీరిస్‌కి నల్లపురెడ్డి శ్రీచరణి తొలిసారి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోంది.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం..

చిన్నప్పటి నుంచి ఆటలపై ఇష్టం చూపెట్టే శ్రీచరణిని తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది. అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న శ్రీచరణి క్రికెట్‌పై ఆసక్తి చూపగా అమ్మానాన్న మొదట సందేహించారు. క్రికెట్‌పై ఉన్న ఆసక్తిని గమనించిన మామ కిశోర్‌కుమార్‌రెడ్డి శ్రీచరణిని ప్రోత్సహించారు.

సరదాగా మొదలు పెట్టిన క్రికెట్ ఇప్పుడు సర్వస్వం అయింది. భారత జట్టు స్థాయికి చేరుకోవడంతో ఓవైపు తండ్రి చంద్రశేఖరరెడ్డి, మరోవైపు మామ కిశోర్‌కుమార్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రోత్సాహం ఉంటే అమ్మాయిలు కూడా ఎందులోనైనా రాణించగలరని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సీఏవైడీ హర్షం...

భారత జట్టులో స్థానం సంపాదించి ముక్కోణపు టోర్నిలో శ్రీలంక టూర్‌కు శ్రీచరణి ఎంపిక కావడంపై క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) అధ్యక్ష కార్యదర్శులు ఎం భరత్‌రెడ్డి, ఏ రెడ్డిప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. కడప గడపలో శిక్షణ పొందిన శ్రీచరణి అంచెలంచెలుగా ఎదుగుతూ క్రికెట్ రంగంలో రాణిస్తున్న వైనాన్ని వారు వివరించారు. భారత జట్టుతో సుస్థిర స్థానం సంపాదించి ప్రతిభ శ్రీరణిలో ఉందని వారు అభిప్రాయపడ్డారు.